రచన - ఫిబ్రవరి 2000

# కౌక్షింభర్యము

క్లిష్టమైన పదమైనా అందరికీ వర్తించేదే పొట్ట నింపుకోవడం. అర్థం సులువైనదైనా ఆచరణ కష్టమైనది. గాలి, నీళ్ళతో బాటు తిండి కూడా వుంటేనే, జీవుడు శరీరాన్ని లాగిస్తాడు. శరీరం జీవాన్ని నిలుపగలుగుతుంది. బ్రతకడం కోసం తినాలి, తినేందుకు బ్రతకాలి.

మాంసాహార విషయంపై స్వామి వివేకానందుని ఎవరో భక్తుడు ప్రశ్నించాడట. "నువ్వు జీవించడం కోసం ఏదో తినక తప్పదు. నీ ఆకలిని తీర్చుకొనే లక్ష్యంతో నువ్వే ఆహారాన్ని తీసుకొన్నా తప్పు లేదు. కాని మాంసాహారాన్ని భుజిస్తూ జీవహింస జరిగిందని చింతిస్తే మాంసాహారం భుజించడం పాపమే!" అన్నారటాయన. వివేకానందుడి సమాధానం లౌక్యంగా ఉంది కాని ఇదమిత్థంగా లేదనిపిస్తుంది.

తర్వాత ఆ భక్తుడే ప్రశ్నలడిగాడో తెయదుకాని 'క్షుద్బాధని తీర్చుకోవడం కోసం పాపచింతన లేకుండా ఏ పనైనా చెయ్యగలిగితే చెయ్యవచ్చు' ననే వక్రభాష్యం చెప్పుకొని, మాంసాహార, శాకాహారాల మాటటుంచి, విపరీతమైన జనాభాతో సతమతమవుతున్న మన దేశంలో, అసలు ఆహార సముపార్జనకోసమే అవినీతి పథాలని అనుసరించడంలో తప్పులేదని ప్రజలు న్యాయం చెప్పుకొంటున్నారు. ఇది (అ)నైతికపరమైన తర్కం.

అయితే ఆహారపరంగా జరిగే హింసని గురించి కనక ఆలోచిస్తే ఇటు శాకాహారుల్లోనూ, అటు మాంసాహారుల్లోనూ చాలా కాంట్రడిక్షన్స్ - అంటే వైరుధ్యాలు కానవస్తాయి.

'బ్రహ్మజ్ఞానం సంపాదించినవాడు బ్రాహ్మణుడు' అనే నిర్వచనానికి దూరంగా, జన్మత: బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన నేను బ్రాహ్మణత్వాన్ని ఎలా వెలగబెట్టి తగలెట్టానో తెలియదు కాని, ఆహారం విషయంలో మట్టుకు శుద్ధశాకాహారిని. దీనికి రెండు కారణాలు, ఒకటి నేను శాకాహారుల కుటుంబంలో పుట్టినవాణ్ణి, రెండవది కాస్త వివరంగా చెప్పాలి. మా పెద్దాపురం నాలుగో నెంబరు మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్లో నేను ఒకటో క్లాసు నుంచి అయిదో క్లాసు

వరకు చదువుకున్నాను. మా స్కూలుకి ఓ చెరువుగట్టు మీదుగా నడిచి వెళ్ళాలి. ఓ రోజున గట్టుకి దిగువగా ఉన్న ఓ యింటి ఆవరణలో ఓ మేకపోతుని తెగ నరుకుతున్న దృశ్యం కనబడింది. మెడ తెగిన మేక మొండెం నుంచి రక్తం ధారాపాతంగా ప్రవహిస్తోంది. ఇంకా ప్రాణాలు పోని ఆ మొండెం కాళ్ళు గిలగిలా కొట్టుకొంటున్నాయి. అలా బాల్యావస్థలో నా మనసు మీద ఓ చెరగని ముద్ర పడింది. తర్వాత నా జీవితంలో కొన్ని పరిస్థితుల్లో కడుపైనా మాడ్చుకొన్నాను కాని, మాంసాహారం వైపు మొగ్గు చూపలేదు.

1957 సంవత్సరంలో ఎమ్.ఎస్.సి. చదవడం కోసం ఆంధ్రా యూనివర్సిటిలో జేరిన నేను, వెజిటేరియన్ మెస్‌లో ఖాళీ లేకపోవడం మూలాన ముందస్తుగా ఓ నెల రోజుల పాటు నాన్ వెజిటేరియన్ మెస్‌లో చేరవలసి వచ్చింది. రాత్రి ఒక పూట మటుకే ఓ నాన్ వెజిటేరియన్ డిష్ తయారు చేసేవారు. నాకు తెలిసిన నలుగురైదుగురు మాంసాహార మిత్రులు పోటీలు పడి నన్ను రూం దగ్గర్నుంచి మెస్ వరకూ తీసుకువెళ్ళి, నా పక్కన కూర్చుని నేను తినని ఆ వంటకాన్ని వాళ్ళు అదనంగా స్వాహా చేసేవారు. ఎన్నిసార్లడిగినా లేదనకుండా వెజిటేరియన్ వంటకాల్ని కాస్త విదిలించే ఆ మెస్సుల్లో, రుచి లోపం వల్ల రెండోసారి అడిగి వేయించుకొనే అవసరం ఎప్పుడో కాని వచ్చేది కాదు. కానైతే ఒకేసారి వడ్డించే ఆ మాంసాహారం కోసం రెండోసారి తాపత్రయడే నా మిత్రుల వరస నా కర్థమయ్యేది కాదు.

1974వ సంవత్సరంలో మా సంస్థ ఓ ఆరుగుర్ని ఉన్నతమైన తర్ఫీదు కోసం అమెరికా పంపింది. టెక్సాస్ రాష్ట్రంలోని ఫోర్టువర్త్ అనే నగరంలో మా ప్రధాన శిక్షణా కేంద్రం ఉంది. ముందస్తుగా దగ్గరగా ఉన్న ఓ హోటల్లో బస చేశాం. రెండు రోజులు మూడు పూటలా బ్రెడ్డూ - సలాడ్‌తో మొహం మొత్తిన మేమిద్దరం.... మొండి శాకాహారులం కాస్త నీరసపడ్డంతో, లాభం లేదనుకొని కిచెన్ తదితర సదుపాయాలూ ఉన్న సింగిల్ రూం అపార్ట్‌మెంట్ కాంప్లెక్సులో ఓ మూడు గదులు అద్దెకు తీసుకుని, యిద్దరేసి చొప్పున సర్దుకొన్నాం. దగ్గరలోనే ఉన్న సేఫ్‌వే డిపార్ట్‌మెంటల్ స్టోర్సులో కావల్సినవన్నీ కొని వంట ప్రారంభించాం. మిగిలిన నలుగురిలోనూ యిద్దరు శాకాహారులున్నా వాళ్ళకి అట్టే పట్టింపు లేకపోవడం మూలాన, సాంబారూ వగైరాల వాటికి మా కిచెన్ మీద దండయాత్ర చేసి, ఫ్రైడ్ చికెన్ కోసం కెంటకీ వారి కౌంటర్స్‌ని దర్శించి పుష్టు లాగించే సరికి, నెల రోజుల్లో నాలుగు కిలోలు బరువు పెరిగి, పాంట్లతో కుస్తీలు పట్టడం మొదలు పెట్టారు.

ఓసారి మధ్యాహ్నం పూట లంచ్‌కని ఓ కేఫ్టీరియాకి తీసుకుపోయాడు మా శిక్షణాధికారి, 'మీకు కావల్సినన్ని వెజిటబుల్స్ దొరుకుతాయని'. బఫె విధానంలో ఆహారం అమర్చబడి ఉంది. ఉడకబెట్టిన చాలా రకాల కూరలు కనబడ్డంతో కాస్తంత చప్పగా ఉన్నా ఏదో కాస్త సంతృప్తిగా భోజనం చేసిన మా యిద్దరికీ, ఆ సాయంత్రం ఆ శిక్షణాధికారి భార్య ఓ చిన్న రహస్యం చెప్పేసి తన మొగుడి మాట వినవద్దని హెచ్చరించింది. అదేమిటంటే - 'మీరు వెజిటబుల్స్ అని ఏం తీసుకొన్నా, వాటిని చికెన్ స్టాక్‌లో ఉడికిస్తారు, లేదా వేయించడానికి యానిమల్

ఫాట్ ఉపయోగిస్తారు'. తెలియకుండా చేసింది కనక పర్వాలేదని, అందువల్ల పాపం లాంటిది ఏదైనా ఉంటే అదంతా తన మొగుడికే వెడ్తుందని మమ్మల్నీ, తన భర్తనీ కూడా ఆట పట్టించింది. అతగాడు నవ్వుతూ, 'ఇది మీ కడుపుల్ని శుద్ధి చేస్తుంద'ని స్కాచ్ గ్లాసులు చేతిలో ఉంచాడు. అలా నా శాకాహార వ్రతంలో కొన్ని భంగాలు జరగకపోలేదు.

అదే తర్ఫీదు సమయంలో నా జ్ఞాపకాలలోంచి చెరిగిపోని మరో చిన్న హాస్య సంఘటన జరిగింది. అమెరికా న్యూమెక్సికో రాష్ట్రంలోని 'ఫార్మింగ్టన్' అనే ఓ ముడిచమురు స్థావరమైన పట్టణంలో రెండు వారాల పాటు ఉండడం జరిగింది. ఊరికి కాస్త దూరంలో ఉన్న ఓ మోటల్‌లో బస చేశాం నేనూ, నా స్నేహితుడు హష్మీ. రాత్రి తొమ్మిది ప్రాంతాన ఆ మోటల్ తాలూకు రెస్టారెంట్‌లో అడుగు పెట్టి, ఓ బల్ల దగ్గర కూర్చున్నాం. మమ్మల్ని చూస్తూనే ఓ మెక్సికన్ వెయిట్రెస్ మా దగ్గరకొచ్చి ఏదో స్పానిష్‌లో మాట్లాడింది. మాకు స్పానిష్ రాదని, మేం ఇండియన్లమని ఇంగ్లీషులో చెప్పగానే, 'ఏ జాతి ఇండియన్లు మీరు?' అని వెంటనే ప్రశ్నించింది. 'మేడమ్ మేము రెడ్ఇండియన్లకి సంబంధించిన ఏ జాతి వాళ్ళమూ కాము, ఇండియన్ ఇండియన్లమ'న్నాం. ఆమె నవ్వుతూ 'ఏం ఆర్డరు చేస్తార'ని మెనూకార్డు ముందర పెట్టింది.

మంచి ఆకలి మీద నున్న హష్మి వెంటనే చికెన్ సూప్‌కి, మీడియమ్ స్టీక్‌కి ఆర్డరిచ్చి మెనూకార్డు నా ముందరకి తోశాడు. 'చూడు మేడమ్ నేను శాకాహారిని. మీ మెనూలో నాక్కావల్సిందీ, నేను తినగలిగిందీ ఏమీ లేదు. అంచేత బ్రెడ్ టోస్ట్ సలాడ్, కాఫీ తీసుకువస్తే సంతోషిస్తాను' అన్నాను. ఆమె రెండు గ్లాసులు ముందర పెట్టి, క్రష్డ్ ఐస్‌తో ఉన్న మంచినీళ్ళు పోసింది. ఆ రోజున నా గొంతుక నొప్పిగా ఉండడం మూలాన మామూలు నీళ్ళు తీసుకురమ్మన్న వెంటనే, ఆమె ఆశ్చర్యంగా చూస్తూ కాస్త బల్ల మీదకు వంగి, "ఏమిటి, మీరు చల్లని నీళ్ళని కూడా నాన్ వెజిటేరియన్‌గా భావిస్తారా?" అని ప్రశ్నించింది చిలిపిగా. నేనూ చాలా హాయిగా నవ్వేస్తూ నా గొంతు నొప్పిని గురించి చెప్పాను. ఆమె కూడా నవ్వుతూ కిచెన్ లోపలికి దారి తీసి ఓ చైనీస్ కుక్‌తో తిరిగివచ్చింది. "ఇలా బ్రెడ్‌లతో, టీ, సలాడ్‌లతో కాలక్షేపం చెయ్యడం చాలా కష్టమవుతుంది మీకు. నాకు కొన్ని ఇండియన్ వంటకాలు వచ్చు. ఒక్క అరగంట ఆగితే నీ కోసం నేను ప్రత్యేకంగా ఏదైనా చేసి తీసుకువస్తాను" అన్నాడు. వెంటనే హష్మీ కూడా తన ఆర్డరు కాన్సిల్ చేసి తనకీ వెజిటేరియన్ ఆహారం తీసుకురమ్మన్నాడు. ఆ అరగంటా కాలక్షేపం చెయ్యడం కోసం రెండు మూడు అరపెగ్గులు లాగించామని వేరే చెప్పనక్కర్లేదు. మేమున్న రెండు వారాలు ఆ కుక్ ధర్మమా అని తిండికి బాధపడనవసరం లేకపోయింది.

1971 ఇండో-పాకిస్తాన్ యుద్ధ సమయంలో జమ్మూలో ఉన్నప్పుడు ఇంట్లో గ్యాసూ, కిరసనాయిలూ రెండూ నిండుకోవడంతో ఓ రెండు రోజులు శ్రమపడవలసి వచ్చింది. దగ్గర్లోనే ఉన్న గాంధీనగర్ గోల్ మార్కెట్లో ఉన్న ఓ సర్దార్‌జీ ధాబాలో తిండి తినవలసిన అగత్యం ఏర్పడింది. వీధి అరుగుల మీద గుండ్రటి గాడిపొయ్యిల్లో రాక్షస బొగ్గులు వేసి వంట చేసే విధానం తినే వాళ్ళకి శుభ్రంగా కనబడ్తుంది. మాకంటే ముందుగా ఆర్డరు చేసిన ఓ వ్యక్తికి ఓ

ఫ్రైయింగ్ పాన్‌లో చికెన్ కర్రీని వేడిచేసి యిచ్చి, అదే పాన్‌లో మేం చెప్పిన దాల్‌కి తడఖా వేసి యిచ్చాడు. శ్రీమతి తినడానికి మొరాయించింది. పక్కనే కూర్చున్న మా పంజాబీ స్నేహితులైన భల్లా దంపతులు హితబోధ చేశారు. చేసిందంతా కనబడ్తోంది కాబట్టి సంశయిస్తున్నారు గాని, పెద్ద పెద్ద హోటళ్ళలో కూడా శాకాహారం మాంసాహారంతో సంకరమవుతూనే ఉంటుందని. ఆ సర్దార్జీ మా మాటలు విన్నాడు. మా శ్రీమతిని ఉద్దేశించి, “బెహన్జీ, మీరు సాబ్‌తో యింటికి స్కూటర్ మీద వెళ్ళి ఓ రెండు మూడు గిన్నెలు పట్టుకురండి, కావాలనుకుంటే వేరే ప్లేట్లు కూడా తెచ్చుకోండి, మీకు గ్యాస్ దొరికేవరకూ మీ పాత్రల్లోనే వంట చేసి యిస్తాను. మీ పిల్లలకి వేడి పాలూ, మీకు కాఫీ, టీలు కావల్సివచ్చినా ఫ్లాస్కులు తీసుకువస్తే అవి కూడా సరఫరాచేస్తాను” అన్నాడు. ఆ సర్దార్‌జీని మేమింత వరకూ మరిచిపోలేదు.

‘హింసాపరంగా ఆలోచించి నువ్వు శాకాహారిగానే ఉండిపోయావని చెబ్తున్నావు కదా, నువ్వు నిజంగా అహింసావాదాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తున్నావా?’ అని మీరెవరైనా ప్రశ్నిస్తే, లేదని నిర్మొహమాటంగా చెప్పవలసి వస్తుంది. ఎందుకంటే-

ప్రతి విషయంలోనూ మానవుడు కొన్ని హద్దులేర్పచుకొంటాడు. కొన్ని కొన్ని నిర్ణీతమైన వలయాల్లో మానవుడు కొన్నిటిని తన కనుగుణంగానూ, మరికొన్నిటిని వ్యతిరేకంగానూ పరిగణిస్తాడు. దీనికి కొంతవరకూ అతని చుట్టూ ఉన్న సమాజం కూడా ఆమోదముద్ర నిస్తుంది. ప్రాణిని చంపి దాన్ని ఆహారంగా వండుకొని తినడం దారుణం అని శాకాహారాన్ని భుజించే మానవుడు కూరగాయల్నీ, ఫలాల్నీ, తదితర వరి ధాన్యాల్నిచ్చే మొక్కల్నీ, చెట్లనీ, పంటల్నీ జీవమున్నవాటిగా పరిగణించడు. అవి కూడా ఒక రకమైన జీవంతో ఉంటాయని ఆలోచించడు. అలా ఆలోచించిన రోజున ఆ జీవుడు ఆకలితో మాడి చావాల్సిందే! హింసని గురించి అతని ఆలోచన చరించగల ప్రాణితో ఆగిపోతుంది. ఇది తిండికి సంబంధించిన హింసాతర్కం.

హింసని గురించి, మాంసాహారాన్ని గురించి యింతగా చెబ్తున్న నేను, చేతి మీద వాలి కుడ్తున్న దోమని ఠప్‌మని కొట్టి చంపేస్తాను. తేలు కనబడితే చెప్పుతో నలిపి పారేస్తాను. పాము కనబడితే ధైర్యమున్నవాడి చేతిలో కర్రపెట్టి ముందుకు తోస్తాను. దోమల్నీ, బొద్దింకల్నీ తదితర క్రిమికీటకాదుల్నీ, ఫ్లిట్ గొట్టాలతో మందులు జల్లి చంపడానికి వెనుదీయను. ఇదే విషయంలో ఇటీవలే ఓసారి చిన్న సందిగ్ధంలో పడిపోయాను.

ఆ మధ్యన ఇంట్లో బొద్దింకల బెడద ఎక్కువై లక్ష్మణరేఖ సుద్ద ముక్కలూ, బేగాన్ బైట్లూ, తదితర క్రిమిసంహారక స్ప్రేలూ వాడవలసి వచ్చింది. ఈ దాడిలో కొన్ని బొద్దింకలు వెళ్ళి దేవుడి గూట్లోని ఇత్తడి సింహాసనాల కిందా, దేవుడి పటాల వెనుకా చేరాయి. దైవసాన్నిధ్యంలో ఉన్న వాటినీ, దేముడి శరణుజొచ్చిన వాటినీ ఎలా చంపడమా అని ఆలోచించినప్పుడు, ఉగ్ర వాదులూ తీవ్రవాదులూ సంఘంలో అలజడులు రేపి, సమయానికి దేవాలయాల్లోనూ, మసీదుల్లోనూ, చర్చిల్లోనూ ప్రవేశించి, రక్షక భటుల్ని సందిగ్ధంలో పడేసిన అనేక సంఘటనలు గుర్తుకొచ్చాయి. అయితే మతపరమైన గొడవలు బొద్దింకలు తీసుకురావన్న ధీమాతో,

దైవసాన్నిధ్యంలో వాటికి ముక్తిని కలిగించడం పుణ్యమే అన్న భావనతో, ఫ్లిట్ గొట్టాన్ని దేముడి గూటి వైపు తిప్పాను. నిత్యమూ దీప, ధూప, నైవేద్యాల్నందుకొనే గూట్లోని దేముళ్ళు ఆ రోజున ఉక్కిరి బిక్కిరయ్యారేమో నాకు తెలియదు.

'ఏ నియమానికైనా ఖచ్చితమైన హద్దులు ఏర్పరుచుకోవడం అన్ని సమయాలా వీలుకాదు. ఓ రకమైన Transition Zone - అంటే అవస్థాంతర ప్రదేశముండాలి అంటారు, అనుభవజ్ఞులు. తిండి విషయంలోనూ అంతేనని నేను గ్రహించాను. చేపలు ఈదే కూరగాయలని కడియం మత్స్య వ్యవసాయ కేంద్రము దగ్గర బోర్డులు చూసినా, పాలు మాంసాహారమే కాని శాకాహారం కాదన్న వాదనలు విన్నా, ఈ మధ్యాంతర ప్రదేశం స్ఫురిస్తుంది.

ఇక మాంసాహారుల విషయానికి వస్తే వారిలో కూడా కొన్ని నిషిద్ధాలుంటాయి. పాశ్చాత్య దేశాలలో చాలామంది తినదగిన అన్ని జంతువుల్ని చంపి తింటూంటే, మతప్రాబల్యమైన దేశాల్లో కొన్ని కొన్ని జంతువుల మాంసం నిషేధం. కొంతమందికి జంతువుని చంపే విధానం మీద కూడా పట్టింపు ఉంటుంది. కోసే విధానం కొంపలకీ, వధ్యశాలలకీ పరిమితమైతే. మన దేశంలో పలుమారులు ఆవూ - పందీ విభేదాలు కొంపల్నంటించాయి. రాజకీయ కల్లోలాల్ని సృష్టించాయి. పండుగలకీ, పబ్బాలకీ కోళ్ళనీ, మేకల్నీ కోసే మాంసాహారులు కూడా పూజలూ, పునస్కారాలూ చేస్తున్నప్పుడు మాంసం జోలికి పోరు. మాంస భుక్తికీ, దైవభక్తికీ మధ్యనున్న గీత స్పష్టంగా ఉంటుంది.

ఇంకో విచిత్రమేమిటంటే గంప కింద గడ్డిలో కోడిపెట్ట పెట్టిన గుడ్లని ఏ విధమైన చింతనా లేకుండా, పచ్చి గుడ్డు మొదలుకొని గుడ్ల కూర వరకూ ఆనందంగా భుజించే వ్యక్తులు కూడా, నీళ్ళ గది కిటికీల్లో, సీలింగ్ ఫాన్‌పై డొప్పల్లో పావురాలూ, పిచికలూ గూళ్ళు కట్టి గుడ్లు పెడ్తే ఆ గుడ్లు పిల్లల కింద మారి రెక్కలొచ్చి ఎగిరేవరకూ ఆ గూడుని తీయడానికి వెనకాడతారు. పనిమనుషుల్ని తియ్యమని పురమాయించినా, వాళ్ళూ చాలామంది తిరస్కరిస్తారు. నిశితంగా ఆలోచిస్తే, ఎత్తుగా ఎగిరే పావురాలకీ, పిచికలకీ ఓ న్యాయం. ఎగిరి యింటి కప్పు మీద కూర్చుని మరి పైకి ఎగరలేక పెరట్లో నడిచే కోడికో న్యాయం అనిపిస్తుంది.

పాశ్చాత్య దేశాలలో నిత్య మాంసాహార ప్రియులు కూడా, జీవహింస చేసి నేసిన మింక్ కోట్లని ధరించరాదని, పష్మీనా శాలువాలు ధరించరాదని, అల్ప సంఖ్య మృగజాతుల్ని వేటాడి వాటి చర్మాలని గృహాలంకరణలకి వాడరాదని ఆంక్షలు పెడ్తూ ఎన్నో ఆందోళనలు లేవదీయడం జరుగుతోంది. దీనికి విరుద్ధంగా ప్రపంచమంతటా వధ్యశాలల్లో అనునిత్యమూ వేల సంఖ్యల్లో చంపబడే జంతువుల్ని గురించి ఎవరూ ఆలోచించరు. ఆలోచించినా అది సరఫరా చేయబడే మాంసం ఆరోగ్యకరమైనదా, కాదా అన్నంతవరకే కాని, హింసాపరంగా మట్టుకు కాదు. ఇటీవలే "పిచ్చి ఆవు రోగం" (Mad Cow Disease) యూరప్ దేశాలనన్నింటిని ఓ ఊపు ఊపింది. 1950ల్లో చికాగో మాంస పరిశ్రమని గురించి 'అప్టన్ సింక్లెర్' వ్రాసిన "జంగిల్" అనే నవల చాలా పెద్ద అలజడి రేపడంతో, అమెరికన్ ప్రభుత్వం ఆ పరిశ్రమ మీద చాలా ఆంక్షల్ని

విధించింది.

మన దేశంలో వున్న వధ్యశాలలు పనిచేస్తున్న తీరు గురించి. మాంసాన్ని దుమ్ము రేగే పురవీధుల్లో వ్రేలాడదీసి అమ్మే తీరుని గురించి మాట్లాడకపోవడమే మంచిది.

ఇంకో విచిత్రమైన విషయమేమిటంటే, శాకాహారులు కానీండి, జంతువుల పట్ల ఓ స్థాయి జీవకారుణ్యంగల మాంసాహారులు కానీండి, చంపబడిన జంతువుల చర్మాలతో కుట్టబడిన పాదరక్షలని ధరించడానికి ఏమాత్రమూ వెనుదీయరు. ఆ చర్మాలతో చేయబడ్డ చేతి సంచీలనీ, పర్సులనీ వాడ్డానికి శాకాహార స్త్రీలు కూడా సంకోచించరు.

కడుపు నింపుకోవడం కోసం నరమాంస భక్షణ చేసే కొన్ని ఆదిజాతి మానవుల్ని గురించి అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. అయితే ఆకలి బాధకి ఓర్వలేక దక్షిణ అమెరికా ఆండీస్ హిమశిఖరాల్లో జరిగిన విమాన ప్రమాదంలో బలికి బయట పడ్డ కొందరు ఫుట్‌బాల్ ఆటగాళ్ళు చాలా రోజులు సందేహించి, చివరకు చనిపోయిన తోటి ప్రయాణికుల మాంసాన్ని కోసి తిన్న వైనం నాగరిక ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపింది. రోమ్‌లో ఉన్న ఉన్నత క్రైస్తవ మతాధికారులు కూడా అటూ యిటూ చెప్పలేక పోయారు. చనిపోయినవారిని తిన్నారు కాని, చంపి తినలేదు కాబట్టి వాళ్ళు క్షమార్హులేనని చాలామంది అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మనిషి మనిషిని చంపినందుకు మరణ దండన విధించే ప్రపంచ సమాజం మనిషి కాని ఏ జీవిని మాంసపు కూడు కోసం, లేదా తదితర ప్రయోజనాల కోసం చంపినా మౌనంగానే ఉండిపోతుంది. ఒక్క యుద్ధంలో తప్పించి సంఘపరమైన, వ్యక్తిగతమైన వైషమ్యాలతో హత్యలు జరిగినప్పుడు శిక్షాస్మృతి దాన్ని చాలా పెద్ద నేరంగా పరిగణించి శిక్షించడంలోని పరమార్థం-మాట నేర్చిన మనిషి మిగిలిన జీవరాశులన్నింటికంటే అధిక్యుడన్న భావన తప్ప మరేమీ కాదంటాడు 'కార్ల్‌సాగాన్'. అందుకని తన అవసరాలకి జంతువుల్ని చంపే అధికారం ఉందను కొంటాడు మానవుడు. ఈ భూతలం మీద నివసించడానికి మనిషి కొక్కడికే కాదు, అన్ని జీవరాశులకి హక్కుందని వాపోతాడు 'సాగాన్'.

వాస్తవానికొస్తే చిన్నచేపలు పురుగుల్ని తింటాయి. చిన్నచేపల్ని పెద్దచేపలు మింగుతాయి. సాధుజంతువులు కసవు తిని బ్రతికితే, ఆ సాధుజంతువుల్ని క్రూరమృగాలు భక్షిస్తాయి. మానవుడిటు శాకాల్నీ, అటు భూ, జల, విహంగ జీవరాశుల్నీ నిక్షేపంగా వండుకొని తింటాడు. ఒక విధంగా ఆలోచిస్తే అందరూ శాకాహారులుగా ఉన్నా, అందరూ మాంసాహారులుగా మారినా భూమి తట్టుకోలేదు. అందుచేత ఈ ఆహార నియమాలు ప్రకృతి ఏర్పరచిన న్యాయాలని అంగీకరిస్తే వీటిని గురించి వాదానికి తావుండదు.

ఇంతటి తర్కాన్నీ యోగి వేమన రెండు పాదాల్లో చెప్పాడు.

**బొంది వేఱు కాని భువి ప్రాణమొక్కటె**
**అన్నము, లిల వేఱె యాకలొక్కటే.**

ఇంక సూక్ష్మంగా ఒక్క చిన్న వాక్యంలో చెప్పాలంటే 'జిహ్వకో రుచి'!.